# కాపాడలేకపోయారు

### కేన్స్‌ను కష్టపడి తెచ్చాం.. కేటీఆర్ ఆవేదన



హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): కర్నాటకకు వెళ్తున్న కేన్స్ కంపెనీని ఒప్పించి తెలంగాణకు వచ్చేలా చేస్తే.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దాన్ని కాపాడుకోలేకపోయిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేన్స్ కంపెనీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా చేసేందుకు ఎంతో కష్టపడినట్టు ఆయన పేర్కొన్నారు. సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ గుజరాత్‌కు వెళ్తున్నట్టు వస్తున్న వార్తలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. 'కేన్స్ సంస్థ తెలంగాణలో పెడతామన్న తమ యూనిట్‌ను గుజరాత్‌కు తరలిచేందుకు సిద్ధమైందని వార్తలు వస్తున్నాయి. అది వింటుంటే చాలా బాధనిపిస్తోంది. ఈ సంస్థను కర్నాటక నుంచి తెలంగాణకు రప్పించేందుకు ఎంతో కష్టపడ్డాం' అని కేటీఆర్ నాటి శ్రమను గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్‌లో యూనిట్ ఏర్పాటు కోసం కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్ పక్కన భూమి కేటాయించాలని వారు కోరారని, పది రోజుల్లోనే భూమి కేటాయించామని తెలియజేశారు. దీంతో కేన్స్ కంపెనీ గత ఏడాది అక్టోబర్‌లో తమ యూనిట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిందని, ఇప్పుడు ఆ సంస్థ గుజరాత్‌కు తమ యూనిట్‌ను తరలిస్తుందన్న వార్తలు చూస్తుంటే చాలా బాధ కలుగుతున్నదన్నారు. పెట్టుబడులతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ దూరమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ఇండస్ట్రీలో దాదాపు రూ.3,500 కోట్లతో కేన్స్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిందని, అది సాకారమైతే మన యువతకు ఉపాధితోపాటు రాష్ట్రానికి ఆదా యం పెరిగేదన్నారు. కేన్స్ కంపెనీ తరలిపోవడం తెలంగాణకు చాలా నష్టమంటూ కాంగ్రెస్ సర్కారు అసమర్థతపై కేటీఆర్ మండిపడ్డారు.

# టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు కిక్కు!

### 18 శాతం జీఎస్టీ ఎత్తివేతకు ఆస్కారం

### ఈ నెల 9న జరిగే సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: రాబోయే వస్తు, సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) సమావేశంలో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలకు చెల్లించే ప్రీమియంలపై జీఎస్టీని ఎత్తివేసే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ పాలసీల ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ పడుతున్నది. ఈ నేపథ్యంలో ఎప్పట్నుంచో దీన్ని తొలగించాలని అటు పాలసీదారులు, ఇటు బీమా పరిశ్రమ వర్గాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. తమకు ఇది ఆర్థిక భారంగా ఉంటున్నదని పాలసీ హోల్డర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 9న జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో ఈ అంశాన్ని పరిశీలించబోతున్నారని సమాచారం. దీంతో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ల ప్రీమియంలపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తీసేసే వీలుందని భూటా షా అండ్ కో. ఎల్ఎల్‌పీ పార్ట్‌నర్ హర్ష భూటా చెప్తున్నారు.

**ఇదీ సంగతి..**

జీవిత బీమా రకాల్లో టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలదే ఇప్పుడు హవా. ఇతర ఏ మెచ్యూరిటీ ప్రయోజనాలు లేకుండా కేవలం డెత్ బెనిఫిట్ (పాలసీదారు మరణానంతరం వచ్చే ప్రయోజనం) మాత్రమే ఇందులో ఉంటుంది. తక్కువ ఖర్చుతో భారీ మొత్తాలను పాలసీదారులు అందుకునే అవకాశం వీటిలో ఉన్నది. అయితే పాలసీ వ్యవధిలో పాలసీదారుడు చనిపోతేనే బీమా ప్రయోజనం ఉంటుంది. లేకపోతే ఈ బీమాకు ఖర్చు చేసిన మొత్తాలను వదులుకోవాల్సిందే. గడువు దాటితో మళ్లీ కొత్త పాలసీ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రీమియంల ఆధారంగా పాలసీ ప్రయోజనాలుంటాయి. ఒకేసారి వేలు, లక్షలు చెల్లిస్తే కోట్లలో పరిహారం లభిస్తుంది. అయితే ఆకస్మిక మరణాలు సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు టర్మ్ ఇన్సూరెన్స్ అనేది కొండంత అండగా నిలుస్తున్నది. అందుకే ప్రీమియంలు ఎక్కువైనా వీటినే తీసుకొనేందుకు అంతా ఆసక్తి చూపిస్తున్నారు. కానీ ఈ ప్రీమియంలపై జీఎస్టీ 18 శాతం ఉండటంతో పాలసీదారులకు, పరిశ్రమకు కొంత ఇబ్బందికరంగా ఉంటున్నది. జీఎస్టీ మినహాయింపు దక్కితే పెద్ద ఎత్తున టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల అమ్మకాలు జరుగుతాయని, అందరికీ బీమా అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కూడా త్వరగా నెరవేరుతుందని అంతా అంటున్నారు. ఇక టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ఇతర లైఫ్ ఇన్సూరెన్స్‌ల తరహాలో పెట్టుబడి కోణంలో చూడవద్దని, కుటుంబ పెద్ద చనిపోతే.. ఆ కుటుంబం రోడ్డు నపడకుండా టర్మ్ ఇన్సూరెన్స్ కాపాడుతుందని, వారి భవిష్యత్తు అవసరాలే తప్ప ఇందులో పాలసీదారులకు ఎలాంటి లాభాలకు తావు లేదన్న అభిప్రాయాలూ ఇండస్ట్రీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అందువల్లే జీఎస్టీ మినహాయింపు అంశాన్ని వచ్చే వారం సమావేశంలో కౌన్సిల్ పరిశీలించబోతున్నట్టు చెప్తున్నారు.

## ఇతర పాలసీలపై..



యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు (యులిప్స్)గా ఉన్న ఇతర జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేతకు వీలుండకపోవచ్చని కూడా అంటున్నారు. పాలసీదారుడు మరణించినా.. మరణించకపోయినా నిర్ణీత కాలవ్యవధి తర్వాత బీమా ప్రీమియంల సొమ్ము తిరిగి వస్తుందని గుర్తుచేస్తున్నారు. పాలసీదారులకు, వారి కుటుంబ సభ్యులకు బీమా ప్రతిఫలం అందుతుందని, కాబట్టి ఈ మనీ బ్యాక్ పాలసీలన్నింటినీ పెట్టుబడుల కోణంలోనే చూస్తారంటూ వాటిపై 18 శాతం జీఎస్టీ ఇకపైనా కొనసాగుతుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే కొంత మొత్తంలో ఈ పన్ను భారాన్ని తగ్గించవచ్చని, మొత్తంగా మాత్రం తీసేయకపోవచ్చని మరికొందరు అంటున్నారు. కాగా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై వసూలు చేస్తున్న 18 శాతం జీఎస్టీని వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్లు వస్తున్నట్టు గత నెల్లోనే చెప్పారు. వీటిని జీఎస్టీ మండలి సమావేశాల్లో పరిశీలిస్తామని కూడా ఆమె అన్న విషయం తెలిసిందే.




## మూతపడుతున్న కాఫీ డే స్టోర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న కేఫ్ కాఫీ డే(సీసీడీ) అవుట్‌లెట్లు మూతపడుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరినాటికి వీటి సంఖ్య 450కి తగ్గినట్లు, ఇదే సమయంలో కార్పొరేట్ స్థలాలు, హోటళ్లలో వెండింగ్ యంత్రాలు మాత్రం 52,581కి పెరగడం విశేషం. అలాగే వాల్యు ఎక్స్‌ప్రెస్ కియోస్కులు కూడా 265కి తగ్గాయని తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సీసీడీ 469 కేఫ్స్, 268 సీసీడీ వాల్యు ఎక్స్‌ప్రెస్ కియోస్కులు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.966 కోట్ల స్థూల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుతం కంపెనీకి రూ.1,159 కోట్ల అప్పులు ఉన్నాయి.

## వృద్ధి 7 శాతం!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 7 శాతం వృద్ధిని సాధించనున్నదని వరల్డ్ బ్యాంక్ తాజాగా అంచనాను విడుదల చేసింది. వ్యవసాయరంగం, గ్రామాల్లో డిమాండ్ మళ్లీ పుంజుకోవడంతో ఈసారి వృద్ధి అంచనాను సవరించినట్లు తెలిపింది. అంతర్జాతీయ దేశాల్లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం మరింత బలోపేతం అవుతున్నదని, దక్షిణాసియా దేశాల్లో అత్యధిక వృద్ధిని సాధిస్తున్న దేశం కూడా భారతేనని స్పష్టంచేసింది.

## బీవోఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ముంబై, సెప్టెంబర్ 3: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ప్రత్యేక డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'స్టార్ ధన్ వృద్ధి ఫిక్స్‌డ్ డిపాజిట్' పేరుతో ప్రకటించిన ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ డిపాజిట్లపై రుణాలు తీసుకోవడంతోపాటు ముందస్తుగా విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కూడా డిపాజిట్‌దారులకు కల్పించింది. స్వల్పకాలం మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ డిపాజిట్లపై వడ్డీరేట్లు ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది.

# సింగరేణి ఐదు కొత్త గనులు!

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మరో ఐదు కొత్త బొగ్గు గనులను ప్రారంభించడానికి సిద్ధమైంది సింగరేణి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఐదు బొగ్గు గనులను ప్రారంభించడానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం ఆదేశించారు. వీటిలో కొత్తగూడెం వీకే ఓపెన్‌కాస్ట్, ఇల్లందు రొంపేడు, బెల్లంపల్లి గోలేటి, రామగుండం కోల్‌మైన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తిచేసి, అనుమతులు కూడా సాధించాలని సూచించారు. ఇకపై రోజుకు కనీసంగా రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యంగా పెట్టుకొని చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. సింగరేణి భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో గనుల వారీగా ఉత్పత్తి వివరాలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయామని పలువురు జీఎంలు సీఎండీకి వివరించారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులంతా ప్రణాళికబద్ధంగా పని చేయాలని ఆయన సూచించారు.

# ఆర్థికానికి పొదుపే బలం

**గృహస్తుల సేవింగ్స్ పెరుగుతున్నాయ్ • ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ పాత్రా**

ముంబై, సెప్టెంబర్ 3: దేశంలో గృహస్తుల పొదుపు తిరిగి పుంజుకుంటున్నదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్రా తెలిపారు. 2020-21లో కరోనా దెబ్బకు హౌస్‌హోల్డ్ సేవింగ్స్ దారుణంగా పడిపోయాయన్న ఆయన ఇప్పుడు పెరుగుతున్నాయని, రాబోయే దశాబ్దాల్లో దేశ ఆర్థిక వ్యవస్థకు అసలు సిసలైన దన్ను ఈ పొదుపేనని అన్నారు. మంగళవారం ఇక్కడ సీఐఐ 'ఫైనాన్సింగ్ 3.0' పేరిట వికసిత్ భారత్ కోసం నిర్వహించిన సదస్సులో పాత్రా కీలకోపన్యాసం ఇచ్చారు. భారత్‌లో గృహస్తుల పొదుపు చాలా కీలకమని, ఇతర రంగాలకూ వీరి నుంచి పెట్టుబడులు అందుతాయన్నారు. అయితే కరోనా పరిస్థితులతో అంతా తలకిందులైందని, మళ్లీ కోలుకుంటున్న ప్రజలు.. తిరిగి సేవింగ్స్ బాట పట్టారని చెప్పారు. ఇప్పటికే కుటుంబాల నుంచి భౌతిక పొదుపు జీడీపీలో 12 శాతానికి చేరిందని, ముమ్ముందు మరింత పెరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 2010-11లో నాటి జీడీపీలో 16 శాతంగా ఉన్నట్టు గుర్తుచేశారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ స్వాగతోపన్యాసంలో మాట్లాడుతూ.. దేశ ఆర్థిక విధానాలను అనుసంధానిస్తూ ఆర్బీఐ చర్యలుండటం, విదేశీ వాణిజ్యం-పెట్టుబడుల ప్రదర్శన బాగుండటం కలిసొస్తున్నదన్నారు. దేశంలో పెరిగే పెట్టుబడుల సామర్థ్యం.. డిజిటల్ ఎకానమీతో పాటు రెన్యువబుల్ ఎనర్జీ, గిడ్డంగులు, సెమీ కండక్టర్ ఎకోసిస్టమ్, డాటా సెంటర్ల వంటి వాటికి లాభిస్తుందని అభిప్రాయపడ్డారు.

## బీఎస్ఎన్ఎల్ తెలంగాణ సీజీఎంగా రత్న కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 3: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా జీ రత్న కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ టెలికం సర్వీసెస్(ఐటీఎస్) 1988 బ్యాచ్‌కు చెందిన ఆయనకు టెలికం రంగంలో 34 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది.

## వరద బాదితులకు ఎయిర్‌టెల్ ఆఫర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 3: ప్రముఖ టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్.. తెలుగు రాష్ట్రాల్లో వరదబాదితులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ప్రీపెయిడ్ వినియోగదారుల కాల పరిమితిని మరో 4 రోజులు పొడిగించిన సంస్థ.. పోస్ట్‌పెయిడ్ వినియోదారులు తమ బిల్లుల చెల్లింపుల గడువును 7 రోజులు పొడిగించింది. అలాగే వై-ఫై సేవలు పొందుతున్న వారికి మరో నాలుగు రోజులు గడువిచ్చింది.

## మహీంద్రా డిస్కౌంట్ మేళా

**రూ.3 లక్షల వరకు రాయితీ ప్రకటించిన సంస్థ**

ముంబై, సెప్టెంబర్ 3: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా వాహన కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. ఎంపిక చేసిన మాడళ్లపై రూ.3 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. వీటిలో థార్ ఆర్‌డబ్ల్యూడీ, స్కార్పియో, బొలెరో, ఎక్స్‌యూవీ400లపై రూ.3 లక్షల వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నట్లు పేర్కొంది. వీటిలో ఎక్స్‌యూవీ400 మాడల్‌పై రూ.3 లక్షల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్న సంస్థ..థార్ 3-డోర్లు 2 డబ్ల్యూడీ, 4 డబ్ల్యూడీపై రూ.1.50 లక్షల వరకు, బొలెరోపై రూ.90 వేల వరకు, నియోపై రూ.84 వేలు, స్కార్పియో క్లాసిక్‌ను కూడా తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. పండుగ సీజన్ కంటే ముందుగానే సంస్థ ఈ భారీ రాయితీ ప్రకటించడం విశేషం. దీంతో థార్ రోక్స్ ధర రూ.12.99 లక్షల నుంచి రూ.20.49 లక్షల లోపు లభించనున్నది.

| మాడల్ | డిస్కౌంట్(రూ.లో) |
|---|---|
| ఎక్స్‌యూవీ 400 | 3,00,000 |
| థార్ | 1,50,000 |
| బొలెరో | 89,997 వరకు |
| నియో | 84,999 వరకు |
| స్కార్పియో క్లాసిక్ | 20,000 |







## జావా నుంచి సరికొత్త బైకులు

మహీంద్రా గ్రూపునకు చెందిన ప్రీమియం మోటర్‌సైకిల్ బ్రాండ్ జావా మరో మూడు మాడళ్లను మార్కెట్‌కు పరిచయం చేసింది. జావా 42 ఎఫ్‌జే పేరుతో విడుదల చేసిన ఈ మోటార్‌సైకిళ్లు రూ.1.99 లక్షల నుంచి రూ.2.20 లక్షల లోపు లభించనున్నాయి. ఈ సందర్భంగా మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ప్రీమియం మోటార్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, దీంతో తమ బ్రాండ్ మరింత బలోపేతం కానున్నదన్నారు. ప్రస్తుతం క్లాసిక్ లెజెండ్స్..జావా బ్రాండ్‌తో భారత్‌తోపాటు తూర్పు ఆసియా దేశాల్లో బైకులను విక్రయిస్తున్నది.

## వరద బాధితులకు చేయూత









బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. పలు జిల్లాల్లో వరదలు ముంచెత్తడంతో జనజీవనం స్తంభించిపోయింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరగడంతో పాటు వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు సినీ ప్రముఖులు ముందుకొస్తున్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తమవంతుగా సహాయం అందిస్తున్నారు. అగ్ర హీరో బాలకృష్ణ వరద బాధితుల సహాయార్థం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి 50 లక్షల చొప్పున మొత్తం కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణ, ఏపీకి 50లక్షల చొప్పున కోటి రూపాయలను అందజేయనున్నట్లు మహేష్‌బాబు ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ సైతం రెండు రాష్ట్రాలకు చెరో 50 లక్షలు ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు సూర్యదేవర రాధాకృష్ణ (చిన బాబు), నాగవంశీ కలిసి రెండు రాష్ట్రాలకు 25 లక్షల చొప్పున విరాళాన్ని ప్రకటించారు. యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ తెలంగాణ, ఏపీకి 15 లక్షల చొప్పున మొత్తం 30లక్షల విరాళాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఐదు లక్షల చొప్పున మొత్తం పది లక్షల విరాళాన్ని అందిస్తున్నట్లు హీరో విశ్వక్‌సేన్ సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. యువ దర్శకుడు వెంకీ అట్లూరి సైతం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి చెరో 5 లక్షలు విరాళాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. కథానాయిక అనన్య నాగళ్ల రెండు రాష్ట్రాలకు కలిపి ఐదు లక్షల విరాళాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది.

## భారత్ భాగ్య విధాత



కంగనారనౌత్ స్వీయ దర్శకత్వంలో నటించిన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' విడుదల వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఓ వర్గం వారిని కించపరిచేలా వివాదాస్పద అంశాలున్నాయని కేంద్ర సెన్సార్ బోర్డ్ అభ్యంతరం తెలపడంతో రిలీజ్‌ను వాయిదా వేశారు. ఈ వివాదం కొనసాగుతుండగానే కంగనారనౌత్ 'భారత్ భాగ్య విధాత' పేరుతో కొత్త సినిమాను మొదలుపెట్టింది. దేశభక్తి ప్రధానంగా తెరకెక్కించబోతున్న ఈ సినిమాలో స్వాతంత్ర్య సమరయోధులను త్యాగాలను ఆవిష్కరించబోతున్నామని, ఇప్పటివరకు వచ్చిన దేశభక్తి సినిమాలకు భిన్నంగా ఉంటుందని కంగనారనౌత్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొంది. మనోజ్ తపాడియా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో పాటు తమిళ హీరో ఆర్.మాధవన్‌తో సైకలాజికల్ థ్రిల్లర్‌లో నటించబోతున్నది కంగనారనౌత్.

**చిత్రం**



## 'విశ్వం' యాక్షన్ హంగామా

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకుడు. యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 11 ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. నరేష్ వాయిస్ ఓవర్‌తో ఆరంభమైన టీజర్ ఆద్యంతం కామెడీ, యాక్షన్ అంశాలతో అలరించింది. నాయకానాయికలు గోపీచంద్, కావ్యా థాపర్‌ల పరిచయ ఘట్టాలు చక్కటి హాస్యాన్ని పండించాయి. దర్శకుడు శ్రీను వైట్ల తనదైన శైలి యాక్షన్, వినోదాత్మక అంశాలతో సినిమాను తీర్చిదిద్దారని టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాలో గోపీచంద్ పాత్ర స్టైలిష్‌గా ఉంటుందని, కావాల్సినంత కామెడీతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కెవీ గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, దర్శకత్వం: శ్రీను వైట్ల.

## ఇకపై జాగ్రత్తగా ఉంటాం

### కేంద్రానికి నెట్‌ఫ్లిక్స్ హామీ

1999 నాటి కాందహార్ హైజాక్ ఉదంతం నేపథ్యంలో రూపొందించిన 'ఐసీ 814: ది కాందహార్ హైజాక్' నెట్‌ఫ్లిక్స్ సిరీస్ వివాదాల్లో చిక్కుకుంది. ఈ సిరీస్‌లో ఉగ్రవాదుల పేర్లను మార్చి చూపించారని, ప్రేక్షకులను తప్పుదోవ పట్టించే విధంగా ఉద్దేశ్యపూర్వకంగా దర్శకనిర్మాతలు వ్యవహరించారని విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ వివాదాస్పద అంశాలపై వివరణ ఇవ్వాలని నెట్‌ఫ్లిక్స్‌కు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ కంటెంట్ హెడ్ మోనికా షెర్గిల్ కేంద్ర అధికారుల ముందు హాజరయ్యారు. ఇక నుంచి కంటెంట్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటామని, సమీక్షలు చేపడతామని ఆమె కేంద్రానికి హామీ ఇచ్చారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గంట పాటు జరిగిన ఈ సమావేశంలో తీవ్రవాదుల పేర్లను మార్చి చూపించడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. భవిష్యత్తులో దేశ ప్రజల మనోభావాలను గౌరవించేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తామని, చిన్నారులకు సంబంధించిన కంటెంట్ విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటామని నెట్‌ఫ్లిక్స్ కేంద్రానికి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## 'శ్వాగ్' వచ్చేది అప్పుడే..

వరుస విజయాలతో జోరు మీదున్నాడు యువహీరో శ్రీవిష్ణు. ఆయన తాజా చిత్రం 'స్వాగ్'. హసిత్‌గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 4న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, వినూత్న కథాంశంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. వింజమర వంశ నేపథ్యంలో హాస్యప్రధానంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కథానాయిక రీతూవర్మ మహారాణి రుక్మిణి పాత్రలో నటిస్తుండగా, హీరో శ్రీవిష్ణు నాలుగు విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్, శరణ్య ప్రదీప్, సునీల్ తదితరులు చిత్ర తారాగణం.






## రాజమౌళి స్ఫూర్తితో సినిమా తీశాం

**దళపతి విజయ్** కథానాయకుడిగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'GOAT' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు వెంకట్‌ప్రభు మాట్లాడుతూ 'నేను దర్శకుడు రాజమౌళిగారికి పెద్ద అభిమానిని. ఈ సినిమా చేయడానికి ఆయనే స్ఫూర్తినిచ్చారు. ఇదొక హోల్‌సమ్ ఎంటర్‌టైనర్. హీరో విజయ్ మునుపెన్నడూ చూడని కొత్త పంథాలో కనిపిస్తారు. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాం' అన్నారు. 'పుష్ప' వంటి పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని తమిళ నిర్మాత అర్చన కల్పాతి పేర్కొన్నారు. అద్భుతమైన విజన్‌తో దర్శకుడు వెంకట్‌ప్రభు ఈ చిత్రాన్ని తీశాడని నటుడు ప్రశాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయికలు మీనాక్షి చౌదరి, స్నేహ, సంగీత దర్శకుడు యువన్‌శంకర్ రాజా తదితరులు పాల్గొన్నారు.


